# సత్యవాక్కు

సంపుటి - 42 మే - 2021 సంచిక - 10



MAY 21

## క్రైస్తవ మాసపత్రిక

మే - 2021

సంవత్సర సభ్యత్వము రూ।। 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| బుధవారం సాయంత్రం | : | 6.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥లకు కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥లకు కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | లక్ష్మీ గూటం |
| | | రోసీ గూటం |

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

ఈ సంచికలో


1. మంచి గొర్రెల కాపరి - పేజీ 3
2. క్రీస్తు ధర్మశాస్త్రము - 8
3. సారెపతు విధవరాలు - 13
4. అచ్చజటామాంసి అత్తరు బుడ్డి - 19
5. సంక్షిప్త వార్తలు - 23



**SATYAVANI**

P.O. BOX. 80, KAKINADA

PIN : 533004. PH : 0884-2363722

98489 98547, www.satyavanivcoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్: జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42 మే - 2021 సంచిక - 10


## మంచి గొర్రెల కాపరి

మంచి గొర్రెల కాపరిని గూర్చి యేసు చెప్పిన ఉపమానమును మనము యోహాను సువార్త 10:1-16లో చదువుకొనగలము. యోహాను సువార్త 9వ అధ్యాయములో యేసు ఒక పుట్టు గ్రుడ్డి వానిని బాగుచేసెను. అప్పటికే ఆనాటి మతగురువులు యేసే క్రీస్తని యెవడైన ఒప్పుకొనిన యెడల వానిని సమాజ మందిరములో నుండి వెలివేయ నిశ్చయించిరి. దృష్టి పొందిన ఈ గ్రుడ్డివాడు యేసును గూర్చి బహిరంగముగా ఒప్పుకొనుచున్నందున వారతని వెలివేసిరి (యోహాను 9:34). వెలివేయబడిన ఈ మనుష్యుని యేసు కనుగొని అతని హెచ్చరించుటకు గాను మంచి గొర్రెల కాపరిని గూర్చిన ఉపమానమును బోధించెను. ఆయన యిట్లనెను :

"గొర్రెల దొడ్డిలో ద్వారమున ప్రవేశింపక వేరొక మార్గమున ఎక్కువాడు దొంగయు దోచుకొను వాడునై యున్నాడు. ద్వారమున ప్రవేశించువాడు గొర్రెల కాపరి. అతనికి ద్వారపాలకుడు తలుపు తీయును, గొర్రెలు అతని స్వరము వినును... మరియు అతడు తన స్వంత గొర్రెల నన్నిటిని వెలుపలికి నడిపించునపుడెల్ల వాటికి ముందుగా

నడుచును; గొర్రెలు అతని స్వరము యెరుగవు గనుక అన్యుని ఎంత మాత్రమును వెంబడింపక వాని యొద్ద నుండి పారిపోవును... గొర్రెల ద్వారమును నేనే; ... నేనే ద్వారమును.. నేను మంచి గొర్రెల కాపరిని; మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణము పెట్టును. జీతగాడు గొర్రెల కాపరి కాడు గనుక గొర్రెలు తనవి కానందున తోడేలు వచ్చుట చూచి.. పారిపోవును.. నేను గొర్రెల మంచి కాపరిని... నా గొర్రెలను నేను ఎరుగుదును, నా గొర్రెలు నన్ను ఎరుగును. మరియు గొర్రెల కొరకు నా ప్రాణము పెట్టుచున్నాను. ఈ దొడ్డివి కానివి వేరే గొర్రెలును నాకు కలవు; వాటిని కూడ నేను తోడుకొని రావలెను. అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొర్రెల కాపరి ఒక్కడును అగును".

ప్రభువు తన ప్రజల యెడల యెట్టి దయను, ప్రేమను, కరుణా కటాక్షములను కలిగి యున్నారో ఈ ఉపమానము మనకు విశదపరచుచున్నది. నేను గొర్రెల మంచి కాపరిని అని యేసు చెప్పుకొనెను. అంతేకాదు, దేవుని ప్రజల కాపరి వలె ఆయనకు కలిగిన హక్కును గూర్చి ఆయన అనేక కారణములను చూపించెను. నైతికముగాను, ఆత్మీయముగాను కూడ ఆయన ఒక్కడే మానవుల ఆత్మలను కాయుటకు అర్హుడై యున్నారు. ఆయా కారణములను మన మిప్పుడు చూద్దాం :

మంచి గొర్రెల కాపరి ద్వారము గుండా ప్రవేశించును. పూర్వకాలపు గొర్రెలదొడ్డి నాలుగుగోడల చుట్టూ నిర్మింపబడెను. దానిలో ప్రవేశించుటకు ఒకేఒక్క ద్వారముండెను. సాయంకాలమైనప్పుడు ఈ ద్వారముగుండా గొర్రెలన్నియు లోపలికి ప్రవేశింపజేయబడెను. అటు తరువాత ఆ ద్వారము మూయబడెను. అయితే ఆ ద్వారము లోపల ద్వారపాలకుడొకడు రాత్రి గడుపు చుండెను. తెల్లవారగనే గొర్రెల కాపరి ద్వారము తట్టగా అది అతనికి తెరువబడెను. అప్పుడు అతడు తన సొంత గొర్రెలను పేరుపెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును.

అయితే దొంగయు, దోచుకొనువాడైతే ద్వారమున గాక వేరే విధముగా ఆ దొడ్డిలో ప్రవేశించేవాడు.

యేసు చెప్పిన గొర్రెలదొడ్డి దేవుని రాజ్యము లేక సంఘమై యున్నది. గొర్రెలు దేవుని ప్రజలు. మంచి గొర్రెల కాపరి యేసుప్రభువు. అయితే దొంగలు, దోచుకొనువారు అబద్ధ బోధకులు. పాతనిబంధన లేఖనములు, బాప్తిస్మమిచ్చు యోహాను, యేసుయొక్క పవిత్ర జీవితము, ఆయన చేసిన గొప్ప బోధలు, పనులు ద్వార పాలకులు. ఆయన యొక్క పవిత్ర హృదయమును బట్టియు, జ్ఞానవాక్యములను బట్టియు 'నేను గొర్రెల మంచి కాపరిని' అని చెప్పుకొనే హక్కు యేసు కలిగియుండెను. అందువలన ఆయన దొడ్డిలోనికి ద్వారమున ప్రవేశించును.

మంచిగొర్రెల కాపరి గొర్రెలకు ముందుండి నడిపించును. గొర్రెల మంచి కాపరి వాటిని త్రోలడు గాని వాటిని నడిపించును. యేసు తన ప్రజలను త్రోలడు గాని వారిని నడిపించును. ఆయన యొక్క పవిత్ర జీవిత శక్తిని బట్టి, ప్రేమాను రాగములను బట్టి, ఆశ్చర్యకరమైన మాటలను బట్టి ఆయన వారిని నడిపించును, గొర్రెలకు ముందుగా నడుచుటవలన గొర్రెల కాపరి క్రూరమృగము ఏదయినా వచ్చిన యెడల దానిని ముందుగా ఎదుర్కొనును. ప్రమాదము నుండి తప్పించుటకు ప్రయత్నించును. గొర్రెలు అతని స్వర మెరుగును గనుక అవి అతని వెంబడించును.

విదేశీయాత్రికుడొకడు యెరూషలేము గొర్రెల కాపరి యొక్క దుస్తులను ధరించి ఆ గొర్రెలు అతని వెంబడించునో లేదో చూడగోరెను. గొర్రెలయితే తమ కాపరి యొక్క స్వరమునే వెంబడించెను గాని అతని దుస్తులను వెంబడించ లేదు. అన్యుల స్వరము అవి యెరుగవు గనుక అన్యుని ఎంతమాత్రము వెంబడింపక వాని యొద్ద నుండి పారిపోవునని యేసు చెప్పెను. దేవుని ప్రజలను అన్యమార్గమునకు ఈడ్చుకొని పోవుటకు ప్రయత్నముచేయు అబద్ధ బోధకుడు ఈ అన్యుడు. అయితే వారు క్రీస్తు బోధయందు నిలకడగా

యున్నవారు గనుక అతడు వారిని అన్య మార్గమున పట్టించలేడు. అందువలన క్రైస్తవులు బైబిలును దినదినము చదువుచు దాని ఉత్కృష్ట బోధల నెరుగుట ఎంతో ప్రాముఖ్యము. అట్టి సిద్ధపాటు రక్షణ కవచమువలె పని చేయును.

మంచికాపరి గొర్రెలను సంరక్షించును. యేసుప్రభువు మంచికాపరిని గూర్చి, జీతగానిగూర్చి, దొంగలను గూర్చి పలికెను. దొంగయైనవాడు మందకు హాని కలిగించి స్వలాభమును కోరును. జీతగాడు జీతముకొరకే గొర్రెలను మేపును. అందువలన తోడేలు వచ్చుట చూచి గొర్రెలను విడిచి పారిపోవును. అయితే మంచి కాపరి గొర్రెల క్షేమము నిమిత్తము వాటిని కాయును. దొంగవలెను, అబద్ధ ప్రవక్త వలెను గాక యేసు దేవుని ప్రజల క్షేమమును కోరును. అపాయము వచ్చినప్పుడు ఆయన పారిపోలేదు గాని దేవుని ప్రజలకును పాపపు మృగమున కును మధ్య నిలిచి వారికొరకు తన ప్రాణమును బలియిచ్చెను (యోహాను 3:16).

మంచికాపరి తన గొర్రెలను ఎరుగును. గొర్రెలు అతని నెరుగును. దినదివము, వారమును మించి వారము, నెలలకు మించి నెలలతరబడి గొర్రెలును కాపరియు పచ్చికబయలులోను, గొర్రెలదొడ్డిలోను కలిసియుండుట వలన వారు ఒండొరులను బాగుగా ఎరిగినవారు. అదేరీతిగా యేసుప్రభువును ఆయన ప్రజలును బహు సన్నిహితులు, వారు ప్రగాఢమైన పరస్పర సహవాసముగలవారు. ఆయన తన వారి నెరుగును (2తిమోతి 2:19). తన వారు ఆయన నెరుగుదురు. బైబిలులోని మాటలద్వారా ఆయన వారితో మాటలాడును. ప్రార్థన చేయునపుడెల్లా వారాయనతో మాటలాడుదురు. వారాయన బోధల ననుసరింతురు. అందువలన వారి సహవాసము దృఢమైనది.

చివరిగా మంచికాపరి తన గొర్రెలను సమకూర్చును. యేసు ప్రభువు ఈ ఉపమానము చెప్పుసరికి యూదులు మాత్రమే ఈదొడ్డిలో ప్రవేశించియుండిరి. అయితే ఈ దొడ్డివి

కాని వేరే గొర్రెలను గూర్చి అంటే అన్యులను గూర్చి కూడ ఆయన పలికెను. వారుకూడ సువార్తవిని, విధేయులై దేవుని మందలో చేర్చబడు సమయముకొరకు ఆయన ఎదురు చూచెను. యేసుప్రభువు మృతులలో నుండి పునరుత్థానుడై లేచిన తరువాత సువార్త సర్వజనాంగములకు బోధింప బడెను. వివిధ జనాంగముల వారు సువార్తకు విధేయులై క్రీస్తు సంఘ సభ్యులైరి. అనగా వారందరు ఒకే దొడ్డిలోనికి చేర్చబడిరి. ప్రభువు యొక్క అమితమైన ప్రేమనుబట్టి ఇప్పుడు అందరు ఆయన యొద్దకు ఆకర్షించ బడుచున్నారు.

యేసు చెప్పిన ఈ చక్కటి ఉప మానము నుండి మనము గమనించ వలసిన ముఖ్యవిషయము లేమంటే : క్రీస్తే ద్వారము లేక మార్గమై యున్నారు. నేనే మార్గమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు అని ఆయన చెప్పెను. రక్షణను అన్వేషించుచు మారుమనస్సు పొందిన ఆత్మకు ఆయన ఒక్కడే మార్గము. ఆయన వలన తప్ప మరి యెవని వలనను రక్షణ కలుగదు (అపొ.కా. 4:12).

సంఘము గొర్రెలు లేక దొడ్డియై యున్నది. క్రీస్తు సువార్తకు వినయముతో విధేయత చూపిన వారందరు దానిలో చేర్చబడుదురు (అపొ.కా. 2:47). ప్రభువే తన సంఘ మును కట్టెను. తన స్వరక్తమిచ్చి ఆయన దానిని కొనెను (అపొ.కా. 20: 28). క్రైస్తవులు ప్రభువుకు చెందిన వారు. ప్రభువు క్రైస్తవులకు చెందిన వాడు.

క్రీస్తే మంచి గొర్రెలకాపరి. ఆయన ప్రాణహాని చేయు దొంగగాని, దోచుకొనువాడు గాని కాదు. గాని తన ప్రజలకు జీవము కలుగుటకును, అది సమృద్ధిగా కలుగుటకును ఆయన వచ్చెను. గొర్రెలను వీడి తన ప్రాణ మును కాపాడుకొను జీతగాడు ఆయన కాదుగాని తన ప్రాణము నిచ్చి గొర్రె లను రక్షించు మంచికాపరి ఆయన. అందువలన భక్తుడైన దావీదుతో కలసి మనమిట్లు చెప్పగలము; "యెహోవా నా కాపరి, నాకు లేమి కలుగదు.

పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండ జేయుచున్నాడు. నా ప్రాణము నకు ఆయన సేదదీర్చు చున్నాడు... గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను... నేను బ్రదుకు దినము లన్నియును కృపాక్షేమములే నా వెంట వచ్చును. చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను" (కీర్తన 23).

నీవు యెహోవా మందిరములో, యేసుక్రీస్తు దొడ్డిలో నివాసము చేయ గోరుచున్న యెడల యేసుప్రభువును నమ్ముకొనుము. పాపములను విడనాడుము. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. క్రీస్తే నిన్ను తన సంఘముతో జేర్చి నీ యాత్మను కాయును.

## క్రీస్తు ధర్మశాస్త్రము

పాత నిబంధనకొక ప్రయోజన మున్నది. ఆ ప్రయోజనము నెరవేరి నప్పుడు అది అదృశ్యమాయెనని మనం నేర్చుకొన్నాము. "ధర్మశాస్త్రము నైనను ప్రవక్తల వచనములనైనను కొట్టి వేయవచ్చితినని తలంచవద్దు; నెర వేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించిపోయిననేగాని ధర్మశాస్త్ర మంతయు నెరవేరు వరకు దాని నుండి యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పు చున్నాను" అని యేసు చెప్పెను (మత్తయి 5 :17, 18).

యేసుక్రీస్తు ధర్మశాస్త్రమును నెరవేర్చుటకే వచ్చెనుగాని దానిని తొలగించుటకు రాలేదని కొందరు చెప్పుదురు. అయితే ఏదైనా ఒకటి దాని ప్రయోజనమును నెరవేర్చితే దానినింకా ఉంచుకో వలసినపని యేమున్నది? యేసు చెప్పిన దానిని గమనించుము. ఆయన ధర్మశాస్త్రమును నెరవేర్చుటకు వచ్చారు. అది అంతయు నెరవేరు వరకు దానిలో యేమీ కొట్టివేయబడదని చెప్పారు. అనగా అది నెరవేరిపోయిన తరువాత అది తొలగిపోవును. గనుక యేసు చెప్పినదేమంటే ఒకసారి ఆయన

దానిని పూర్తిగా నెరవేర్చిన తరువాత, అనగా సిలువకు మేకులతో కొట్టి వేయబడిన తరువాత, అది గతించి పోవును. అందుకే యేసుప్రాణము విడువక ముందు "సమస్తమును సమాప్త మాయెను" అని బిగ్గరగా పలికారు (యోహాను 19:30). యేసు చేయడానికి వచ్చిన పని అంతయు సమాప్తి చేసారు. ధర్మశాస్త్రాన్ని నెరవేర్చారు. మానవ పాపపరిహార బలి అర్పించారు. క్రొత్త నిబంధనను, శ్రేష్టమైన నిబంధనను అనుగ్రహించారు.

అయితే మనకు క్రొత్త నిబంధన యున్నందున పాతనిబంధన నిష్ప్రయోజనమైనదని తలంచరాదు. దాని ద్వారా మనము ఇంకను పాఠములను, హెచ్చరికలను పొందుచునే యుందుము. "ఏలయనగా ఓర్పు వలనను, లేఖనముల వలని ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి" యని అపో.పౌలు చెప్పాడు (రోమా 15:4). పాత నిబంధన దేవుని గూర్చి, సృష్టిని గూర్చి, క్రీస్తును గూర్చి, పాపమును గూర్చి, దాని విరుగుడును గూర్చి మొదలగు అనేక పాఠములను మనకు బోధించుచున్నది. యిదివరలో అది యూదులకు ఎట్లు బోధించెనో ఇప్పుడు మనకును అది బోధించుచున్నది. పాత నిబంధన లేకుండా మనము క్రొత్త నిబంధనలో అనేక సంగతులు గ్రహించుకోలేము. గనుక నేటికిని అది మనకు ప్రయోజనకరమైన పాఠ్యపుస్తకమై యున్నది గాని ఒక చట్టముగా అది మన మీద ఏలుబడి చేయదు. మనం దేవునికి చేయు సేవలో, ఆరాధనలో ఏమేమి చేయాలో తెలియ జెప్పుటకు దానికి అధికారము లేదు. మనము పాత చట్టము క్రింద ఇకమీదట జీవించుట లేదు ఏలయనగా అది పాతనిబంధనలో ఒక భాగమైయుండెను.

యేసుక్రీస్తు ఒక శ్రేష్టమైన క్రొత్త నిబంధన నిచ్చుటకు వచ్చెను. ఆయన సిలువపై మరణించినప్పుడు ఆ పాత నిబంధన సిలువకు మేకులతో కొట్టబడెను (కొలస్స 2:14). అదే సమయములో ఆయన క్రొత్త నిబంధనను ప్రతిష్టించెను. ఏలయనగా "మరణ

శాసన మెక్కడ ఉండునో అక్కడ మరణ శాసనము వ్రాసిన వాని మరణము అవశ్యము. ఆ శాసనమును వ్రాసిన వాడు మరణము పొందితేనే అది చెల్లును; అది వ్రాసినవాడు జీవించు చుండగా అది ఎప్పుడైనను చెల్లునా? ఇందుచేత మొదటి నిబంధన కూడ రక్తము లేకుండ ప్రతిష్ఠింపబడలేదు (హెబ్రీ 9:16-18). క్రీస్తు మరణము యొక్క ఆవశ్యకతను తెలియ జేయుటకు లేఖకుడు ఈ ఉదాహరణను చూపియున్నాడు. మనుష్యులు సాధారణ ముగా వీలునామా (మరణ శాసనము) వ్రాయుదురు. వారి తదనంతరము వారి ఆస్థి ఎట్లు విభజింపబడవలెనో అందులో వ్రాయుదురు. అయినను ఆ వీలునామా వ్రాసిన వాడు మరణిస్తేనే అది అమలులోనికి వచ్చును. అతడు బ్రతికియుండగా మొదట వ్రాసిన వీలు నామాను ఎన్నడయినను మార్చుకొన వచ్చును. అదే విధముగా క్రీస్తు యొక్క క్రొత్త నిబంధన ఆయన మరణించే వరకు అమలులోనికి రాలేదు. ఆయన క్రొత్త నిబంధనను ప్రతిష్ఠించుటకు తన రక్తమును చిందించారు. మోషే ధర్మ శాస్త్రము జంతువుల రక్తముచే ప్రతిష్ఠిం పబడితే క్రీస్తు యొక్క క్రొత్త నిబంధన తన స్వరక్తముతోనే ప్రతిష్ఠింపబడెను. గనుక పాత నిబంధనకు బదులుగా క్రొత్త నిబంధన యేసు సిలువ యొద్ద ప్రతిష్ఠింపబడెను. గనుక ఆయన శ్రేష్ఠ మైన క్రొత్త నిబంధనకు పూట కాపాయెను (హెబ్రీ 7:22).

క్రొత్త నిబంధన పాత నిబంధనకు కలుపబడలేదు. అది దానికి బదులుగా ఈయబడెను. క్రొత్త నిబంధన అనగానే పాత నిబంధన తొలగించబడెనను భావము కలుగును. "ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసి యున్నాడు. ఏది పాతగిలి ఉడిగి పోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా యున్నది" (హెబ్రీ 8:13). ఆయన "ఆ రెండవ దానిని స్థిర పరచుటకు మొదటి దానిని కొట్టి వేయు చున్నాడు" (హెబ్రీ 10:9).

రెండు నిబంధనలకు ఒకే సమ యమందు మనము బద్ధులమై యుండ లేము. గత సంచికలో నేర్చుకొనినట్లు

మనం ఇప్పుడు విశ్వాసము ద్వారా క్రీస్తులో యున్నాము, బాలశిక్షకుని క్రింద ఇకమీదటలేము; అది పాత నిబంధన (గలతీ 3:2). అంతేగాక మనము పాత ధర్మశాస్త్రము క్రిందకు పోలేము; పాత దానిని క్రొత్తదానితో కలుపలేము. "మీలో ధర్మశాస్త్రము వలన నీతి మంతులని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులోనుండి బొత్తిగా వేరుచేయబడి యున్నారు. కృపలో నుండి తొలగిపోయి యున్నారని" పౌలు చెప్పాడు (గలతీ 5:4). మనము కృప ద్వారా నీతిమంతులముగా తీర్చబడు చున్నాము (ఎఫెసీ 2:8), అయినను మనము పాత నిబంధనను పాటించ గోరుచున్న యెడల కృపలోనుండి తొలగిపోయి యున్నాము. మరియు మనం రక్షింపబడే ఒకే ఒక్క మార్గమును కోల్పోవుదుము.

ఈ క్రొత్త నిబంధన మరింత మహిమ గలది. దాని యీవులు పాత నిబంధన కంటే ఎంతో శ్రేష్టమైనవి. మోషేకు ఆ పాత నిబంధన ఇయ్యబడి నప్పుడు ఎంత మహిమ గలదై యుండె నంటే ఇశ్రాయేలీయులు ప్రకాశించు చున్న మోషే ముఖమును సయితము చూడలేకపోయిరి (2 కొరింథీ 3:7). అయినను ఆ మహిమ తగ్గిపోవునదై యుండెను (2 కొరింథీ 3:8). "తగ్గి పోవునదే మహిమ గలదై యుండిన యెడల నిలుచునది మరి యెక్కువ మహిమ గలదై యుండునుగదా" (2 కొరింథీ 3:11). ఈ సందర్భములో తగ్గిపోవునది రాతి మీద వ్రాయబడిన పరిచర్యయై యుండెను; దానిలో పది యాజ్ఞలు భాగమైయుండెను. అపో. పౌలు ఇంకా ఇట్లు చెప్పాడు. "ఆయన మన సమాధానమైయుండి మీకును మాకును ఉండిన ద్వేషమును అనగా విధి రూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్యగోడను పడగొట్టి మన ఉభయు లను ఏకము చేసెను. ఇట్లు సంధి చేయుచు ఈ యిద్దరిని ఒక్క నూతన పురుషునిగా సృష్టించి తన సిలువ వలన ఆ ద్వేషమును సంహరించి దాని ద్వారా వీరిద్దరిని ఏక శరీరముగా చేసెను" (ఎఫెసీ 3:14- 16). ఈ రెండు లేఖన భాగములలోను పది యాజ్ఞలతో

కూడిన పాత నిబంధన ఎత్తి వేయబడెనని మనకు విపులీకరించ బడినదని గమనించుము.

లోపభూయిష్టమై, పాప పరి హారము నియ్యలేని ధర్మశాస్త్రమును దేవుడెందుకు యిచ్చారు? నిజానికి ధర్మ శాస్త్రము లోపము గలది కాదు. అది ఎందు నిమిత్తము ఈయబడెనో ఆపని అది పూర్తి చేసెను. పాపమును గూర్చిన జ్ఞప్తి తెచ్చుటకును, దాని క్షమాపణ ననుగ్రహించు క్రీస్తునొద్దకు ప్రజలను తెచ్చుటకును అది ఇయ్య బడెను. ఆ పని అది నెరవేర్చెను, ధర్మ శాస్త్రము లోపములేదు. సమస్య అంతా మానవుని బలహీనతలోను, అతని పాపపు తత్వములోను యుండెను. అతడు ఆ ధర్మశాస్త్రమును పాటించలేక పోయెను.

పాత నిబంధన తొలగించబడి నందున, నేడు ఆత్మీయ విషయాల్లో పాత నిబంధనను బట్టి జరిగించలేము. ఆ అధికారము దానికిలేదు. పది యాజ్ఞలతో నయితము పాత నిబంధనలో ఏ భాగమైనను అమలులో నేడు లేదు. అంటే అనేకులు చేయు మత సంబంధ క్రియలకు, ఆచారము లకు దైవానుమతి లేదు. పాత నిబంధ నలో యున్నాయి గదా అని చేయు క్రియలు నిష్ప్రయోజనము. వీటిలో యాజక ధర్మము, దశమ భాగము, సబ్బాతు నాచరించుట, వాద్య సంగీతము మొదలగునవి నేడు నిష్ప్ర యోజనము. అందువలననే ఎవరును నేడు జంతు బలులు అర్పించరు. పాత నిబంధన ఆచారములను సంఘము లోనికి తేకూడదు. నిజానికి పాత నిబంధనలో ఏ ఆజ్ఞనైనా అనుసరింప గోరితే ఆ యాజ్ఞలన్నింటికి లోబడాలి. ఏలయనగా ధర్మశాస్త్ర గ్రంధమందు వ్రాయబడిన విధుల న్నియు చేయుట యందు నిలుకడగా ఉండని ప్రతి వాడును శాపగ్రస్థుడని వ్రాయబడి యున్నది (గలతీ 3:10; 5:3). క్రొత్త నిబంధన శ్రేష్టమైనది గనుక పాత నిబంధన నాచరించుటకు తలంచేనే కూడదు. తదుపరి సంచికలో క్రొత్తనిబంధన యొక్క శ్రేష్ఠతలను గూర్చి నేర్చుకొందము.

– జెర్రీబేట్స్

# సారెపతు విధవరాలు

కొంతమంది జీవితముల ద్వారాను, వారి క్రియల ద్వారాను జీవ మరణములను గూర్చి నట్టియు, విశ్వాస, జ్ఞానములను గూర్చి నట్టియు విషయములను నేర్చుకొనగలము. భయంకర కరవులో ప్రవక్తయైన ఏలీయాకు ఆశ్రయమిచ్చి పోషించిన సారెపతు విధవరాలిని గూర్చి మనము కొన్ని విషయములు తెలిసికొందము (1 రాజులు 17:8–24).

**ఈ పాఠ్యాంశములో వ్యక్తులు :**

యొర్దానుకు తూర్పున తిష్బీ అను గ్రామమున ఏలీయా అను వ్యక్తి ఇశ్రాయేలీయులకు ప్రవక్తగా యుండెను. ఇతడు యెహోవా ప్రవక్తగా స్థిరపడెను. ప్రవక్త అనబడెడు వ్యక్తి దేవునికి బదులు జనులతో మాట్లాడును (నిర్గమ 4:16). దేవుని మాటలు జనులతో చెప్పునప్పుడు భవిష్యద్విషయములను ప్రవక్త తెలియ పరచవచ్చు; తెలియపరచకపోవచ్చు. ఏలియా నిప్పువంటి ప్రవక్తయని రెండు విషయముల ద్వారా దేవుడు ధృడపరచెను (2 రాజులు 1:10).

తిష్బీయుడై ఏలియా ప్రవక్త కొన్ని ప్రత్యేక లక్షణములు గల వ్యక్తి. ఇతడు అందరితోను కలసి నివసించక ఒంటరిగా అరణ్య ప్రదేశములలో నివసించు చుండేవాడు. అతడు వివాహము చేసికొనలేదు. ఇతడు గొంగళి ధరించుకొని నడుముకు తోలు దట్టి కట్టుకొనెడివాడు (2రాజులు 1:8). అతడు విగ్రహారాధనను ఖండించెడి విధమును బట్టి ధైర్యము గాను, నిర్మొహమాటముగను గద్దించెడి గద్దింపు లను బట్టి ఏలియా ప్రవక్తను బట్టి భయము చెందుచుండెడి వారు (1 రాజులు 19: 10) సారెపతు విధవరాలికి ఏలియా కనబడుసరికి అతడు నిరాశ్రయుడై నిరాదరణతో, ఆకలితో అలమటించుచున్నాడు.

మన కధానాయకురాలు ఒక విధవరాలు. ఆమెకు పోషించు కొనుటకు ఒక కుమారుడు గలడు.

ఈ విధవరాలు చాల పేదరాలు. ఆ దినములలో పింఛనులుగాని, జీవిత భీమాలుగాని, ప్రభుత్వ సహాయములు గాని విధవరాండ్రకు లేవు. ఆమెకు, ఆమె కుమారునికి సరిపడు ఆహారము ఒక్కపూటకు మాత్రమే వారికున్నది. మరికొంత ఆహారము దొరుకునను నమ్మిక ఆమెలో లేదు. ఆమె ముఖములో ఆకలి బాధ కనబడు చున్నది. ఆమె అన్యురాలు. మధ్యధరా సముద్ర ప్రాంతములోని తూరు, సీదోనుల మధ్య గల సారెపతు నగరము ఈ విధవరాలిది.

ఇశ్రాయేలు రాజైన అహాబు, సీదోనీయులకు రాజైన ఎత్బయలు కుమార్తెయైన యెజెబెలును వివాహము చేసుకొని బయలు దేవతను పూజించుచు వానికి మ్రొక్కుచుండెను (1 రాజులు 16:31). తన తండ్రి పరిపాలన చేయుచుండిన రాజ్యములో యెహోవా ప్రవక్తల కొరకు యెజెబెలు వెదకుచుండెను.

ఇటువంటి భయంకరమైన పాలన గలిగిన రాజ్యములో ఈ విధవరాలు ఎంత పేద స్థితిలో యుండినను దయ, కనికరము, ఆదరించే స్వభావము గల వ్యక్తిగా జీవించుచుండెను.

### కాలము

సుమారు క్రీ.పూ. 90 సం॥లో అహాబు, యెజెబెలులు పరిపాలించుచుండిరి. అసమర్థుడైన తన భర్తను తన స్వకీయులవలె బయలు దేవతను పూజించునట్లు యెజెబెలు మార్చెను. వారిరువురును పూర్తిగా విగ్రహారాధికులుగ మారిపోవుట మాత్రమే గాక యెహోవాకు విరోధులుగనైరి. ఆయన సేవకులను చంపించుటకు వారిరువురు యెప్పుడు సిద్ధముగ యుండేవారు. ముఖ్యముగ యెహోవా ప్రవక్తయై యదార్థము చెప్పుటలో పొరబాటును ఖండించుటలో ఏమాత్రము వెనుకాడక ధైర్యము వహించియుండే ఏలియాను చంపుటకు ఆలోచన కలిగి యుండిరి.

దుర్మార్గులైన ఆ పరిపాలకుల కాలములో వారి దేశము మీదికి మిక్కిలి కరువును యెహోవా పంపిం

చెను. అది ఏలియా ప్రార్థనా ఫలితము వలన కలిగినట్టిది (యాకోబు 5 :17). మంచివారికిని, చెడ్డవారికిని ఆ కరువు మిక్కిలి భారముగ యుండెను (మత్తయి 5:46).

## సారెపతు ద్వారము దగ్గర

తన ఆఖరి భోజనము వండు కొనుటకై కొన్ని పుల్లలు ఏరుకొనుటకై వచ్చిన ఈ విధవరాలిని పుల్లలు ఏరుకొనుచుండగా ఏలియా కలుసు కొనెను (1రాజులు 17:8-12). ఏలియా యొక్క శరీరాకృతిని చూచి ఆ విధవరాలు ఎట్లు ప్రతిస్పందించునో మనము ఊహించు కొనగలము. ఈ ఆధునిక యుగములో ఏ స్త్రీయైనను సరే ఒక పొడువాటి గడ్డము గలిగి, గొంగళి కప్పుకొని, చూచుటకు వికారముగ యున్న ఆవ్యక్తిని చూచుసరికి ఒక విధమైన భయముచే ఆవరించబడును. అదేరీతిలో ఈ విధవరాలు కూడ ఏలియాను చూడగానే భయపడి యుండును. ఏలియా ఆమెను చూచి ఆమెను పిలిచి త్రాగుటకై పాత్రలో కొంచెము నీళ్లు తీసుకురమ్మని అడిగెను. అందుకామె సంతోషముతో ఆ పనిచేయుటకు ఒప్పుకొనెను. ఆమె నీళ్లు తేబోవుచుండ గా మరల పిలిచి ఒక రొట్టెముక్కను తన కొరకు తీసికొని రమ్మనెను. అందు కామె అంగీకరించక తొట్టిలో పట్టెడు పిండియు, బుడ్డిలో కొంచెము నూనెయు నాయొద్ద నున్నవేగాని అప్ప మొకటైన లేదు. మేము చావకముందు నేను ఇంటికి పోయి వాటిని నాకును నా బిడ్డకును సిద్ధము చేసికొనవలెనని కొన్ని పుల్లలు ఏరుటకై వచ్చితిననెను. అప్పుడు ఏలియా ఆమెతో ఇట్లనెను: భయపడవద్దు, పోయి నేను చెప్పినట్లు చేయుము; అయితే అందులో నాకొక చిన్న అప్పము మొదట చేసి నా యొద్దకు తీసికొని రమ్ము, తరువాత నీకును, నీ బిడ్డకును అప్పములు చేసికొనుము. భూమి మీద యెహోవా వర్షము కురిపించు వరకు ఆ తొట్టిలో ఉన్న పిండి తక్కువకాదు, బుడ్డిలో నూనె అయిపోదని ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చి యున్నా

డనెను (1 రాజులు 17:13, 14). దైవజనుని మాటలు విధవరాలు నమ్మెను. తన ఆఖరి భోజనమును దైవజనునితో పంచుకొని దీవెన పొందెను (మత్తయి 10:41). దేవుని సేవకుని ఒకరు చేర్చుకొనిన అది దేవుని చేర్చుకొనినట్టే (మత్తయి 10:40). ఆమె దేవునికి ఇచ్చెను. దేవుడామెకు తిరిగి అనుగ్రహించెను (లూకా 6:38). ఆమె దాతృత్వము ఆమెను ఆకలితో ఉండనీయక తాను ఊహించిన రీతిగా సమృద్ధిగ భుజించుటకు దోహదపడెను.

## విశ్వాసము యొక్క రెట్టింపు ఫలితము

అటు తరువాత ఆ విధవరాలి కుమారుడు రోగియై ప్రాణము నిలువ జాలనంత వ్యాధి గలవాడయ్యెను (1 రాజులు 17:17-24). ఆమె తన కుమారుని గూర్చి ఎంతో దు:ఖించుచు తాను పాపము చేసితినేమో, తన పొర బాటు కొరకై తన కుమారుడు బలియై పోయెనా? అని తలంచుచుండెను. అయితే ప్రవక్తయైన ఏలియా ఆమె పొరబాటును బట్టి గాని, అవిశ్వాస మును బట్టి గాని యిది సంభవించెనే యని నిందించక దేవుని సన్నిధిలో ఈ బిడ్డను గూర్చి వేడుకొనెను. తన కొరకు ఎంతో ఉపకారము చేసిన విధవరాలి కుమారునికి తిరిగి ప్రాణము నను గ్రహించుమని దేవుని అడుగుటకు ఏలియా ఏమి వెనుకాడలేదు. ముమ్మారు ఏలియా దేవునికి ప్రార్థించి చిన్నవానికి ప్రాణము మరల రాజేయుమని వేడుకొనెను. యెహోవా ఏలియా చేసిన ప్రార్థన ఆలకించి ఆ చిన్నవానికి మరల ప్రాణము రానిచ్చినపుడు వాడు బ్రతికెను (1రాజులు 17:21-22). ఏలియా ఆ చిన్నవాని తీసికొని తల్లికి అప్పగించెను. ఎంతో దు:ఖించుచున్న తన తల్లిని కుమారుడు గట్టిగా కౌగిలించు కొనినపుడు ఆ సమయము ఎంత ఆనందకరమైనదో మనము ఊహించగలము. ఆనంద బాష్పములు వారి కన్నులనుండి రాలి యుండును గదా.

ఆ స్త్రీ ఏలియాతో నీవు దైవ జనుడవై యున్నావనియు, నీవు పలుకుచున్న యెహోవా మాట నిజమనియు అందుచేత నేనెరుగుదుననెను (1 రాజులు 17:24). ఇది విశ్వాసము యొక్క ఒప్పుకోలు. ఇది చాల గంభీరమైనది.

## మనము తెలిసికొనదగు విషయములు

ఆశీర్వాదములు మనము ఊహించని పరిస్థితుల యందు సాధారణముగ కలుగుచుండును. తన ప్రియమైన కుమారుని మరణము నందు సహో విధవరాలు దీవెనలు పొందగలిగినది. అది ఆమె యొక్క సంపూర్ణ విశ్వాసతకు తోడ్పడినది. అది ఆమె తనయొక్క పాపములను గూర్చిన చింతన కలిగియుండుటకు తోడ్పడినది. ఈ అనుభవము ద్వారా ఆమె మరణ పునరుత్థానములను గూర్చిన అవగాహన కలిగి ఉన్నది. దేవుని మార్గములను అనుసరించుటకు నేర్చుకొనినది. మేలు కలుగుటకై సమస్తమును సమకూర్చి జరిగించుటకు శక్తిమంతుడైన ఇశ్రాయేలీయుల దేవుని శక్తిని ఎరిగి యున్నది (రోమా 8:28).

దేవుడు తన బిడ్డలైన వారికి సహాయము చేయుటకుగాను కొన్నిసార్లు అనామకులైనట్టి వారిని కూడ ఉపయోగించుకొనును. అన్యురాలయినటు వంటి యెజెబెలు రాజ్యములో ప్రవక్త యైన ఏలియాకు ఆశ్రయము దొరుకుట ఒక విశేషము. ఆయన తన అద్భుత కార్యములను జరిగించుటకు దేవుడు కొన్ని అసాధారణ పరిస్థితులను కల్పించుకొనును.

ఫోనీకేలోని స్త్రీలందరు యెజెబెలు వలె దుర్మార్గులని మనము చెప్పజాలము. వారి గుణమును బట్టి కాక, వారి జాతినిబట్టిగాని, వారి ఉనికిబట్టి గాని మనము మనుష్యులకు తీర్పు తీర్చరాదు.

నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును. దుర్దశలో అట్టివాడు

సహోదరుడుగ యుండును (సామెతలు 17:17). ఇచ్చి పుచ్చుకొనుట కొరకు దేవుడు ఒక చట్టము యేర్పాటుచేసెను. ఇయ్యుడి, అప్పుడు మీకియ్యబడును (లూకా 6:38).

కొన్ని అసాధారణ స్థలముల యందు కూడ మనము విశ్వాసమును చూడగలము. అన్యదేశమైన ఫోనీకే యందు కూడ విశ్వాసము కలిగి యుండిన కొద్దిమంది యూదులను చూడగలము. ఒక వ్యక్తిని గాని, లేక ఒక జనాంగమును గాని మనము వారి క్రియలనుబట్టి గాక వారి తెగను బట్టియు, వారి ఆర్థిక స్థితిని బట్టియు, లేక మతమును బట్టియు మంచి, చెడు నిర్ధారణ చేయగూడదు. మానవాళి కంతటికి సువార్త అవుసరము. నమ్మకమైన, మంచి మనసు గల వారనేకులు దేవుని సువార్త వినుటకొరకు ఆశతో కనిపెట్టు చున్నారు.

బాధ, మరణముల నుండి తప్పించుకొనే గృహముండదు. చివరకు పరిశుద్ధులైనటువంటి వారికూడ ఈ భారమును భరింపవలెను (హెబ్రీ 9: 27). ఎవరైతే తన జీవితములో దేవుని ముందు పెట్టుకొనేదరో వారు గాఢాంధ కారపు లోయలో సంచరించినను దేవుడు వారికి తోడై యుండును. (కీర్తనలు 23:4).

మనకు తెలియని వారి యెడల కూడ ప్రేమ చూపుటకు మరచి పోరాదు. భక్తులలో కొంతమంది తెలియకయే దేవదూతలకాతిధ్య మిచ్చిరి (హెబ్రీ 13:2).

- జాన్ వాడీ.

సత్యవాణి స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్‌లో చేరండి. ఆన్‌లైన్‌లో జూమ్‌లో పాఠములు నేర్పబడును. వివరములకు దిగువ నెంబరుకు ఫోన్ చేయండి :

**98489 98547**

# అచ్చ జటామాంసి అత్తరు బుడ్డి పగుల గొట్టుట

యేసు బెతనియలో యుండినప్పుడు అక్కడివారు కుష్ఠరోగియైన సీమోను యింట ఆయనకు విందు చేసిరి. మార్త ఉపచారము చేసెను. లాజరు ఆయనతో కూడ భోజనమునకు కూర్చున్న వారిలో ఒకడు.

ఆయన అచ్చట యుండినపుడు ఒక స్త్రీ (మరియ) మిక్కిలి విలువ గల అచ్చ జటామాంసి అత్తరు ఒక సేరున్నర ఎత్తు తీసికొని, పగులగొట్టి ఆయన తలమీద పోసి ఆయన పాదములను తన తలవెండ్రుకలతో తుడిచెను. ఇల్లు అత్తరు వాసనతో నిండెను. ఆయన శిష్యులలో ఒకడు అనగా ఆయనను అప్పగింపనై యున్న ఇస్కరియోతు యూదా. ఈ అత్తరెందుకు మూడు వందల దేనారములకు అమ్మి బీదలకు ఇయ్య లేదనెను. అతడీలాగు చెప్పినది బీదల మీద శ్రద్ధ గలిగి కాదుగాని వాడు దొంగయైయుండి, తన దగ్గర డబ్బు సంచి యుండినందున అందులో వేయబడినది దొంగిలించుచు వచ్చెను గనుక ఆలాగు చెప్పెను. శిష్యులు ఇది చూచినపుడు వారిలో కొందరు కోపపడి ఈ నష్టమెందుకు? ఇంత విలువైన అత్తరు ఎందుకు పాడుచేయాలి? మూడు వందల దేనారములకు పైగా దీనిని అమ్మి బీదలకు ఈయవచ్చును గదా అని ఆమె మీద సణగుకొనిరి.

అయితే యేసు ఇది ఎరిగినవాడై మీరామెను ఎందుకు తొందర పెట్టుచున్నారు. ఈమె జోలికి పోకుడి. ఈమె నా యెడల మంచికార్యము చేసెను. ఈమె తన శక్తికొలది చేసి నా భూస్థాపన నిమిత్తము నా శరీరమును ముందుగా అభిషేకించెను. బీదలు యెల్లప్పుడు మీతోనే యున్నారు. మీ కిష్టమైనప్పుడెల్ల వారికి మేలు చేయవచ్చును. నేను యెల్లప్పుడు మీతో ఉండను. సర్వలోకములో ఎక్కడ ఈ సువార్త ప్రకటింపబడునో అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగ ప్రశంసింపబడునని మీతో నిశ్చయముగ చెప్పుచున్నాననెను (మత్తయి 26, మార్కు 14, యోహాను 12).

## పరిచర్య

ఇది స్వపరిచర్య మాత్రమే గాక దానికంటె ఎంతో యెక్కువైనట్టిది. అది పొరుగు వారి క్షేమమును గూర్చిన గ్రహింపుగలిగి జీవించుట యనేది. మీలో యెవడు గొప్పవాడై యుండ గోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను; మీలో యెవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీ దాసుడై యుండవలెను. అలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించు కొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగ తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను (మత్తయి 20 : 26–28).

ఇది ఒక అసాధారణమైన ప్రక్రియ, తన్ను తాను పరిత్యజించు కొని ఇతరులకు పరిచర్య చేయుటలో కొన్నిసార్లు సంతోషముండక పోవచ్చు. అందుకొరకు పౌలు ఈ విధంగా చెప్పు చున్నాడు: "కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగ విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము" (గలతి 6:10). మంచి చేయుటను గూర్చి ఆలోచించుట మాత్రమే గాక దాని చేయవలెను అని యాకోబు చెప్పు చున్నాడు. ప్రాణములేని శరీరమేలాగు మృతమో అలాగే క్రియలు లేని విశ్వాస ము మృతము (యాకోబు 2:26). యేసు మేలు చేయుచు సంచారము చేసెను. విశ్వాసమును, మంచి క్రియలను మనము వేరు చేయరాదు.

మన పరిచర్య క్రీస్తుకును, ఆయన బిడ్డలైన వారికిని యుండ వలెను. మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరని గనుక నాకు చేసితిరని నిశ్చయముగ మీతో చెప్పుచున్నాను (మత్తయి 25:35–40). ఎవరి స్వవిషయములను వారు చూచుకొనుట మాత్రమే గాక యితరుల విషయము లను గూర్చి కూడ ఆలోచన కలిగి యుండవలెను (ఫిలిప్పి 2:4). ఈ భూలోకములో యున్నవారి నందరిని యేసువైపుకును ఆయన మార్గముల ననుసరించి జీవించుటకును

నడిపించునట్లు చేయవలెను. పరిచర్య యనే అచ్చ జటామాంసి అత్తరును గూర్చి నీ ఆలోచన యేమిటి? నీవు దానిని పగులగొట్టెదవా లేక పూర్తిగ విడిచిపెట్టెదవా?

## సమర్పణ

మనకున్న దానిలో శ్రేష్టమైన దానిని దేవుని కిచ్చెదమా? నిశ్చయముగా ఇచ్చెదమా? ఇశ్రాయేలీయుల కట్టడ ప్రకారము యెహోవాకు ప్రతిష్టించునది రెండవదిగాని, తృణీకరింపబడినదిగాని అయి యుండకూడదు. ఉన్న వాటిలో శ్రేష్ఠమైనవి. తొలిపిల్ల యెహోవాకు ప్రతిష్ఠితము. దావీదు యెహోవాకు బలి అర్పించుట కొరకు బలిపశువును, ఆ స్థలమును కూడ వెల యిచ్చి కొనెను. "రాజు నేనాలాగు తీసికొనను, వెల యిచ్చి నీయొద్దకొందును, వెల ఇయ్యక నేను తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహనబలిగా అర్పించనని అరౌనాతో చెప్పి ఆ కళ్ళమును, ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను" (2 సమూయేలు 24: 24). తన కొరకు ఉంచుకొనవలెనని దేనిగూర్చి ఉద్దేశము కలిగియుండునో అట్టి శ్రేష్ఠమైన దానిని మాత్రమే దేవునికి ప్రతిష్టించవలెను.

మనకు గల విలువైన వస్తువులు, వ్యక్తులు, విషయములు అనే అచ్చుజటామాంసి అత్తరును దేవునికి సమర్పించుదమా? మాసిదోనియా సంఘము వారియొక్క దాతృత్వమును మనము జ్ఞాపకము చేసికొందము. ఇదియుగాక వారు మొదట ప్రభువునకును, దేవుని చిత్తమువలన మాకును, తమ్మును తామే అప్పగించుకొనిరి; ఇంతగా చేయుదురని మేమనుకొనలేదు (2 కొరింథి 8:5). నేను ఈ మధ్య దేవునికి యేమి సమర్పించితిని? అట్టి సమర్పణను బట్టి నాకు సంతోషము కలిగినదా? అని ప్రశ్నించుకొందము.

ఆత్మ తృప్తి అనే అచ్చ జటామాంసి అత్తరును దేవునికి సమర్పించుదమా? జీవించుచున్నావన్న పేరుమాత్రమున్నదిగాని నీవు మృతుడవే యని సార్దిస్ సంఘమునకు హెచ్చరిక చేయబడినది (ప్రకటన 3:1).

స్వీయ చిత్తము అనే అచ్చ జటా

మాంసి అత్తర్లును దేవునికి సమర్పించుదమా? "యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" (యిర్మీయా 10:23). దేవుడు తన చిత్తానుసారముగ మనలను నడిపించునట్లుగ మనము ఒప్పుకొందుమా? లేక మొండిగ తిరుగ బడుదుమా?

మన ఉద్దేశ్యములు, సంకల్పములు యేమిటి? బహుమతులు, శిక్షలు తీసికొనుచూ మనము కొనసాగుదమా? లేక పిఛ సర్వాహక జ్ఞానము కలిగియుందమా? మరియు వలె ప్రేమతో కూడిన క్రియలు చేయుదమా? లేక మన సమర్పణలు దేవుని లేక మానవుని సంతోష పెట్టునవిగా యున్నావా? (మత్తయి 6:1-6). సమర్పణ అనే అచ్చు జటామాంసి అత్తరు బుడ్డిని పగులగొట్టుదమా?

పరిశుద్ధ జీవితమును జీవించు చుండినపుడు మనము లోకానుసారమైన మాటలు చెప్పము, లేక ఆలోచించము, లేక మన వస్త్రధారణ, మన క్రియలు లోకానుసారమైనవై యుండవు. రోమీయుల వలె మార్పు గలిగిన జీవితములు మనకు కలుగును (రోమా 1:26). మన జీవితములలో క్రైస్తవ కృపలు అధికమగునట్లు జీవించుటలో తొందర కలిగియుందుము (2 పేతురు 1:5). నీతి ఫలములు ఫలించుదుము (గలతి 5:22). పరిశుద్ధమైన జీవితములు జీవించుటయనేది స్వల్ప విషయము కాదు. మనము దేవుని సారూప్యము గలవారముగా మార్చబడవలెను (రోమా 8:29).

మనకున్న దానిలో శ్రేష్ఠమైన దానిని మనకొరకు ఉంచుకొని, దేవునికిచ్చుటలో పిసినితనముగా కొంచెము, కొంచెమే యిచ్చు చున్నామా! బైబిలు ప్రకారము మన జీవితములు ఒక ప్రత్యేకమైనవిగా కనబడుచున్నవా? మన ప్రభువైన యేసు కొరకు మన ప్రేమంతయు ఆయన కొరకు సమర్పించుదమా? క్రీస్తుప్రభువు సేవ చేయుటలో మనము సంపూర్ణ సమర్పణ జీవితములను కలిగి యుందము.

– ఫిల్ డేవిస

# సంక్షిప్తవార్తలు

2021 ఏప్రియల్ 5వ తేదీ సోమవారంనాడు కృష్ణాజిల్లా గుడివాడ పరిసర ప్రాంతములలో నివసిస్తూ అనేక సంవత్సరముల నుండి అక్కడ సువార్త చాటుచున్న శేషం మత్తయి (అంకయ్య) దంపతులు నిర్మించుకొనిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి రిక్కీగూటం గారు హాజరై ఆ గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించిరి. ఆ సందర్భముగా ఏర్పాటు చేయబడిన కృతజ్ఞతా కూటములో వాక్యపరిచర్య చేసిరి. శేషం అంకయ్య (మత్తయి) గారి కుమారులు మరియ దాసు, గోవర్ధనలు కార్యక్రమంలో చురుకుగా పాల్గొనిరి.

2021 ఏప్రియల్ 13వ తారీకు మంగళవారం రాత్రి రిక్కీగూటం గారు రాజమండ్రి, హైదరాబాదు, ఖతార్ మీదుగా బయలుదేరి 15వ తేదీ ఉదయానికి కుటుంబసమేతముగా అమెరికా చేరుకొనిరి. అమెరికా మెంఫిస్ పట్టణములో రోనీగూటం గారు నివసించు చున్నట్లు చదువరులకు విధితమే.

సత్యవాణి స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్ (SSOE) ప్రారంభించబడిన నాటి నుండి నిరాటంకముగా జరుగుచున్నది. మొదట్లో వ్యక్తిగతముగా ప్రజలు హాజరైనా, కోవిడ్ నిబంధనల కారణముగా ఆన్‌లైన్‌లో జూమ్ ద్వారా క్లాసులు నిర్వహించబడు చున్నవి. అనేకమంది తమ తమ యిండ్లలోనే యుండి క్లాసులకు హాజరగుచున్నారు. అమెరికా నుండి రోనీ గూటం గారు, హైదరాబాద్ నుండి పి.ఐ.సబ్బతి గారు, కాకినాడ నుండి కె. ఎలీషా, యమ్. సత్యనారాయణ, యమ్. అప్పారావు, జాషువా గూటం గార్లు వాక్యబోధన చేయుచున్నారు. ఒక్కొక్క బెచ్ 6 వారముల మట్టుకు యుండును. ఆన్‌లైన్లో SSOEలో చేరుటకు 9848998547కు ఫోన్‌చేసి తెలిసికొనుడి.

కోవిడ్ రెండవదశలో అతి త్వరితముగా వ్యాపించుచున్నది. అయినను దేవుని పని నిరాటంకముగానే దేవుని కృపవలన జరుగుచున్నది. సత్యవాణి బైబిలు కోర్సులు, ఉచితబోధనా గ్రంధములు మొదలగునవి కావలసినవారు సత్యవాణి ఆఫీసు ద్వారా పొందవచ్చును.

బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో లక్షలాది ప్రజలు చేరియున్నారు. ప్రతినెలా వందలాది వ్యక్తులకు ఆ కోర్సు పూర్తిచేయగానే బైబిలు గ్రంధము ఉచితముగా అంరజేయుబడుచున్నది. ఈ కోర్సులో చేరుటకు వయోపరిమితి యోమీలేదు. కనీసం 10వ తరగతి చదివినవారు చేరవచ్చును. అంతా ఉచితమే.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2021-2023

సత్యవాక్కు
పోస్టుబాక్సు - 80
కాకినాడ - 533001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేదీ : ప్రతి నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ : ప్రతి నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్. ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004